# రచ్చలో కూర్చున్న రాజేంద్రభోగి

అత్తవారింట్లో అడుగు పెట్టిన జయశ్రీకి, తనకన్నా పదేళ్ళు పెద్దదయిన తోడి కోడలంటే విపరీతమైన భయం, గౌరవం కూడా కలిగాయి. తోడి కోడలు శాంతకుమారి ఎంతో హుందాగా ఉంటుంది. ఇంట్లో అందరూ అన్ని విషయాల్లోనూ ఆమెనే సంప్రదిస్తూ ఉంటారు.

'మా అమ్మనే కాదు, మా వదినని కూడా చాలా గౌరవంగా మర్యాదగా చూడాలి నువ్వు... మా వదిన మాటకెదురు చెప్పడం జరక్కూడదు' రాజేంద్ర మాట పూర్తిచేయలేదు.

"అంటే మీ వదిన పరమ గయ్యాళి గంపన్నమాట" అంది వెంటనే జయశ్రీ.

'మా వదిన దేవత.... ఆవిడ మనసు చాలా మంచిది. చాలా గంభీరంగా కనిపిస్తుంది కానీ, మనసు వెన్న....' రాజేంద్ర జయశ్రీ వైపు చూశాడు.

"ఈ వెన్నలు, నేతులు, పెరుగులు నాకేం అర్థం కావుగానీ అక్కయ్య మనసు మంచిది. అంతేనా" అంది జయశ్రీ.

అంతలోనే శాంతకుమారి ముందుగదిలోకొచ్చి గిరగిర తిరుగుతున్న ఫాన్ ఆర్పింది.

"అవును, మనం ఇక్కడున్నా...అక్కడ ఆ గదిలో ఫాన్ ఎందుకూ! అన్నాడు రాజేంద్ర జయశ్రీ వంక చూస్తూ.

జయశ్రీ ఫక్కున నవ్వింది.

"ఒక్క విషయం చెప్పండి. మీ వదినగారు అప్పుడప్పుడు అదే, ఆర్నెల్లకు, ఏడాదికో పుట్టింటి కెడుతూ ఉంటారా.. ఈ సంసారమే మహాస్వర్గమని, పుట్టింటి విషయం మరచిపోయి, ఈ స్వర్గంలో తేలిపోతూ వుంటారా' రాజేంద్ర చేతిలో కాఫీ కప్పు అందుకుంటూ అడిగింది జయశ్రీ.

'మా వదిన పుట్టింటి కెళ్ళడానికి ముందు మా అన్నయ్య వప్పుకోడు. తరువాత మా అమ్మ. నాన్న కూడా పెద్దగా ఇష్టపడరు. ఎందుకంటే ఆవిడ లేకపోతే ఇంట్లో మా అందరికీ ఇబ్బంది మరి. ఎప్పుడైనా వెళ్ళినా రెండు మూడు రోజులుండి వచ్చేస్తుందంతే."

జయశ్రీ మాట్లాడలేదు. తను పుట్టింటి నుంచి వచ్చి నెలరోజులైంది. ఎందుకో మళ్ళీ వెళ్ళాలని, వెళ్ళి హాయిగా పదిరోజులుండి రావాలనీ, ఈ మాటు తనతో రాజేంద్రని కూడా వెంటబెట్టుకెళ్ళాలని కూడా వుంది మనసులో జయశ్రీకి. కానీ, ఏ కారణం చెప్పి వెడుతుందీ!

వెడతానంటే ఇంట్లో ఎవరూ ఒప్పుకోరేమో...!

జయశ్రీకి వెంటనే చిన్నప్పుడు చదువుకున్న "కలవారి కోడలు కలికి కామాక్షి' కడవలోని పప్పు కడుగుతూ నుండె పాట గుర్తొచ్చింది.

'కడవలో పప్పు పోసి కడిగే వాళ్ళెవరూ లేరిప్పుడూ - ఆరోజుల్లో కాబట్టి ఆ వెర్రి కామాక్షి పప్పు కడుగుతూ కూచుంది. వాళ్ళ అన్న వచ్చి ఊరికి రమ్మంటే, అత్తని, మామని, తోడికోడల్ని, బావగారిని అందరినీ పర్మిషన్ అడిగింది. ఆఖరికి 'రచ్చలో కూచున్న రాజేంద్రభోగి' కదా పర్మిష నిచ్చేది!!

చిన్నప్పుడు స్కూల్లో కలవారి కోడలు కామాక్షి వేషం తను వేసిన విషయం గుర్తొచ్చింది....జయశ్రీ నోటికి చెయ్యి అడ్డం పెట్టుకు నవ్వుకుంది. తనను పుట్టింటికి వెళ్ళమని చెప్పాల్సింది భర్త - అంతే! కానీ, జయశ్రీకి శాంతకుమారి గదిలో తిరుగుతూ కనిపించింది. జయశ్రీ బాగ్‌లో దాచిన ఉత్తరం కళ్ళముందు కదులుతోంది. తల్లి వారంరోజుల క్రితం రాసిన ఉత్తరం అది. ఉత్తరంలో ఆఖరిలైను 'బామ్మ ఆరోగ్యం బాగాలేదు. కొంచెం ఆయాసం ఎక్కువైంది. అయినా ఖంగారు పడాల్సింది లేదని డాక్టరు గారు చెప్పారు' అన్నదే జయశ్రీ మళ్ళీ మళ్లీ చదివింది.

జయశ్రీకి అత్తవారింటి పరిస్థితి బాగా అర్థమైంది. ముందు శాంతకుమారి మనసుకి నచ్చేలాగా తను మాట, ప్రవర్తన నేర్చుకోవాలి.. ఆ తర్వాత ఉత్తరంలో విషయం!!

శాంతకుమారి చిక్కుడు కాయలు ఈనలు తీస్తోంది దొడ్డి గుమ్మంలో కూచుంది. జయశ్రీ తోడికోడలు పక్కన కూచుని చిక్కుడు కాయలు ఈనలు తీయడం మొదలు పెట్టింది.

' మా మరిది లేడా' అంది శాంతకుమారి కత్తిపీట ముందుకు జరుపుతూ.

'ఉన్నారు....రచ్చలో కూర్చున్న రాజేంద్రభోగి ఆయన, మనకేం' అంది జయశ్రీ గొంతు తగ్గించి.

'అంటే' శాంతకుమారి జయశ్రీ వంక చూసింది.

'ఏం లేదు లెండి'

'అయ్యో! చెప్పు, నా దగ్గర నీ మనసులో మాట హాయిగా చెప్పుకోవచ్చు' అంది శాంతకుమారి.

'ఏమీలేదు అక్కయ్యా, పొద్దుటి నుంచీ ఇదే విషయం - నన్ను ఎత్తుకొని, అన్నం తినిపించి, నేనంటే ఎంతో ప్రేమ వున్న మనిషి చావుబ్రతుకుల మధ్య ఉంటే, నేను హాయిగా ఈయనతో సినిమాకి రావాలట - నా మనసు ఒప్పుతుందా, మీరే చెప్పండి అక్కయ్యా!'- జయశ్రీ తలవంచుకు కూచుంది. శాంతకుమారికి ఏమీ అర్థం కాలేదు.

'చావు బతుకులేమిటీ - సరిగ్గా చెప్పు' అంది గట్టిగా.

'అదే - మామ్మకి చాలా సుస్తీగా ఉందిట. నేడో....రేపో అన్నట్టుందిట.. నన్ను చూడాలని కలవరిస్తోందిట...

'అయ్యో! మరి వెళ్ళి చూసి రా' అంది వెంటనే శాంతికుమారి.

'ఏం వెడతానూ.. మా అమ్మ నాన్న ఒప్పుకోరు - మా వదిన కూడా ఒప్పుకోదు - అయినా నెలతిరక్కుండా మళ్ళీ పుట్టింటి కెళ్ళడమేమిటీ - పైగా మీ బామ్మకి తొంభై ఏళ్ళు.... ఇంకా పదేళ్ళు గారంటీగా వుంటుందని చాలా హేళనగా అంటున్నారు....నాకేమో మనసంతా బామ్మ మీదే వుంది' కిందపడ్డ స్టిక్కరు బొట్టు తీసి పెట్టుకుంది జయశ్రీ.

శాంతకుమారి ఏమీ మాట్లాడలేదు. వచ్చి నెలరోజులు కాలేదు. ఇప్పుడే మళ్లీ పుట్టింటికెళ్ళిపోతే మరిది ఒక్కడూ ఇబ్బంది పడిపోతాడు అనిపించింది మనసులో. కానీ మరుక్షణంలోనే శాంతకుమారి మనసు మారిపోయింది.

ఆరేళ్ళనాటి సంగతి గుర్తొచ్చింది:

'అమ్మమ్మ కాలుజారి పడింది....కాలు విరిగింది. మనవలందరూ వచ్చి చూసి వెళ్ళారు...నువ్వు రాకపోతే బాధపడుతుంది కూడా...వచ్చి చూసివెళ్ళు' అంటూ అమ్మ రాసింది ఉత్తరం.

'ఆరు వారాలో, ఎనిమిది వారాలో కట్టు వుంటుంది....ఇంత అర్జంటుగా నువ్వు పరిగెత్తాల్సిన పనిలేదు' అన్నాడు భర్త.

'ఆడబడుచు పురుడయ్యాక వెళ్ళచ్చులే' అంది అత్తగారు. ఆ సంఘటన గుర్తొచ్చింది శాంతకుమారికి. తల్లి దగ్గర నుంచి ఉత్తరం వచ్చిన పదిహేను రోజులకే గుండెజబ్బుతో అమ్మమ్మ మరణించింది.

'ఇదిగో నువ్వెళ్ళిరా' అంది వెంటనే జయశ్రీతో శాంతకుమారి.

'కానీ బావగారు, అత్తగారు...'నసిగింది జయశ్రీ.

'ఎవ్వరూ ఏమీ అనరు...అయినా నువ్వేమయినా ఊరికే సరదాగా వెడుతున్నావా....పాపం, ఆవిడ ఎలా వుంటుందో, ఏమో - అంది జయశ్రీ వంక చూస్తూ.

'అదే అక్కయ్యా..నా కోసమే కలవరిస్తోందిట బామ్మ' అంది కొంచెం గొంతుమార్చి జయశ్రీ.

'నిజమే మరి.....అమ్మమ్మలు, బామ్మలు ఎంత ప్రేమగా చూస్తారు మనుమలని...వెళ్ళమ్మా వెళ్ళు'

'మావారు......'

'ఏమిటీ - మీ వారికీ' నవ్వింది శాంతకుమారి.

'అదే - ప్రాక్టీసు....' నసిగింది జయశ్రీ

'ఊ.....ప్రాక్టీసు - రోగులు రావటంలో పోవటంతో మా మరిదికి ఏం సంబంధం లేదు కదా - ఓ గంట ఆ డాక్టరు కుర్చీలో కూచోటం, ఆ తర్వాత అసిస్టెంటుకి అప్పగించి క్లబ్బుకెళ్ళడం.....అంతేకదా!!!.

'నువ్వు ఊరెళ్ళటానికి అతని ప్రాక్టీసుకి ఏం సంబంధం చెప్పు' గలగలా నవ్వింది శాంతకుమారి.

'అయినా నువ్వు ఒక్క రోజుండి వచ్చేస్తావుగా' అంది జయశ్రీ వంక చూస్తూ.

'అసలు వెళ్ళాలని లేదు అక్కయ్యా....ఈయన్ని, ఈ ఇంటిని వదలి వెళ్ళాలంటే అసలు ఇష్టం లేదు..... అయినా అక్కడ నాకు బోర్ నిజంగా' అంది జయశ్రీ.

శాంతకుమారి మాట్లాడలేదు. లోపలకెళ్ళి తెలుగు కాలెండర్ తెచ్చింది. జయశ్రీకి నవ్వాగలేదు.....కానీ నవ్వితే ఎలా!!!!

బామ్మ తనని ఈ విధంగా కాపాడినందుకు చాల సంతోషించింది జయశ్రీ. పుట్టింటికెళ్ళాలి. తన స్నేహితురాలు మెడిసిన్ చదువుతోంది. సెలవులకి వచ్చింది. తను, అది కలసి సినిమాలకెళ్ళాలి, హోటలుకెళ్ళాలి, చుడీదార్ పైజామాలు కొనుక్కోవాలి.....ఇంకా, ఏవో కబుర్లు చెప్పి భర్తను కూడా తీసుకెళ్ళాలి!!!...జయశ్రీ మనసు పాదరసంలా పనిచేయటం ప్రారంభించింది.

భర్త తన మాటని కాదనడు అనే ధైర్యం బాగా వుంది జయశ్రీకి!!

రాత్రి తొమ్మిదయింది. రాజేంద్ర ఎప్పుడోస్తాడా అని ఎదురు చూస్తోంది జయశ్రీ.

కాలింగ్‌బెల్ మోగటంలో తలుపు తీసింది.

'ఏమిటీ, అంత సంతోషంగా వున్నావ్' అన్నాడు రాజేంద్ర జయశ్రీ భుజం మీద చేయి వేసి లోపలికొస్తూ.

'ఊరెడుతున్నాను.'

'ఊరా'

'అవును....మా బామ్మ'

'ఏమయిందీ...హరీ అందా'

'ఛీ' - బాగానేవుంది

'మరి నువ్వెళ్ళటమెందుకూ'

జయశ్రీ పకపకా నవ్వింది.

అక్కయ్య, బావగారు, అత్తగారు, మామగారు అందరూ నన్ను పుట్టింటికి వెళ్ళిరమ్మని పర్మిషన్ ఇచ్చారు....'రచ్చలో కూచున్న రాజేంద్రభోగి గారి పర్మిషన్ కావాలి' అంది నైటీకి ఉన్న లేసులు సరిచేసుకుంటూ.

రాజేంద్ర మాట్లాడలేదు....

ఇంత తొందరగా మళ్ళీ పుట్టింటికి వెళ్ళటం నిజంగా రాజేంద్రకి ఇష్టం లేదు. 'ఆ కబురు వచ్చాకే వెళ్ళచ్చులే' అన్నాడు ముఖం అటు తిప్పి రాజేంద్ర.

'ఏ కబురూ' అంది జయశ్రీ చాలా ఉత్సాహంగా

'అదే...'

'ఊరుకోండి....ఇప్పట్లో బామ్మకి ఎలాటి అనారోగ్యం లేదు....ఏదో కాస్త ఆయాసం అంతే....కానీ, జయశ్రీ వెంటనే గొంతు తగ్గించేసింది...లైటు ఆర్పేసింది.

భార్యని రైలు ఎక్కించి వెనక్కొచ్చేసిన రాజేంద్ర భోంచేస్తూ.

'నువ్వు వద్దంటావనుకున్నాను...ఆ ముసలమ్మకి ఏదో బాగా లేదని ఈవిడ పరిగెత్తటమేమిటీ' అన్నాడు తల్లితో.

'అదేమిటిలే....చావు బతుకుల మధ్య వున్నప్పుడు మనం ఏమీ అనగూడదు....ఈ పిల్ల వెళ్ళేవరకు ఆ పెద్దప్రాణం వుంటే' – తల్లి ఏదో అంటోంది రాజేంద్ర నవ్వాడు. తింటున్న అన్నం ఆపి. తల్లివైపు చూస్తూ కూచున్నాడు!!!

రెండు రోజులయింది. రాజేంద్ర హడావిడిగా బట్టలు సర్దుకున్నాడు. మెడికల్ కాన్ఫరెన్స్ వుందని, తను వారం రోజులు ఊళ్ళో వుండనని తల్లితండ్రులకు చెప్పాడు. అసిస్టెంటు చూసుకుంటాడులే క్లినిక్ అన్నాడు.

'జయ వస్తే వారం రోజుల్లో వచ్చేస్తానని చెప్పండి అన్నాడు వదినగారితో.

వారం రోజులయింది. జయశ్రీ రాలేదు పుట్టింటినుంచి.

'అబ్బాయి వచ్చేస్తాడు ఇవాళో రేపో....ఒక ఉత్తరం రాయండి కోడలికి' అంది విమలమ్మ భర్త శంకరరావుతో.

'ఆ బామ్మ వెళ్ళి వుంటుంది పైకి....' శంకరరావు నెమ్మదిగా అన్నాడు.

ఆరోజు సాయంత్రం శంకరరావు రాజేంద్ర క్లినిక్‌కి వెళ్ళాడు. అసిస్టెంట్ పేషంట్లని చూస్తున్నాడు.

ఓ అరగంట దాటింది.

మెడికల్ కాన్ఫరెన్స్ అయిందా. మా వాడు చదవాలన్నాడు. ఏ తారీఖో చెప్పాడా' అన్నారు శంకరరావు అసిస్టెంటుతో

'మెడికల్ కాన్ఫరెన్సా – అదేమిటండీ నాకేం తెలియదే' అన్నాడు ఆశ్చర్యంగా అసిస్టెంటు వినయ్‌కుమార్.

'ఓ అదా – రాజేంద్ర విజయవాడ వెళ్ళాడండీ. అటునుంచి మైసూరు, ఊటీ...తను, భార్య ఓ వారం రోజులు ఊటీలో వుండి వస్తానని చెప్పాడు. బహుశా ఎల్లుండి వస్తాడు' అన్నాడు. వినయ్‌కుమార్.

శంకరరావు ఏమీ మాట్లాడలేదు. పది నిముషాలు కూచుని వెళ్ళిపోయాడు.

రెండు రోజులయింది. జయశ్రీ, రాజేంద్ర స్టేషన్‌లో దిగారు. 'ఇద్దరం కలసి ఒకేసారి వెడితే వాళ్ళు.....' ముసిముసిగా నవ్వుతోంది జయశ్రీ.

'ఒక్కసారే వెళ్ళటం ఎందుకు' నవ్వుతున్నాడు రాజేంద్ర

రాజేంద్ర ఇంట్లో అడుగుపెడుతూనే,

'ఈవిడ ఇంకా రాలేదా' అన్నాడు అటుఇటు చూస్తూ

'వస్తుందిలే, వస్తుందిలే, అన్నది వదిన శాంతకుమారి.

రాజేంద్ర వచ్చిన అర్ధగంటకి వీథిలో ఆటో ఆగింది.

'బతికి బయటపడుతుందని ఎవ్వరూ అనుకోలేదు-నిన్న హాస్పటల్ నుంచి బామ్మ వచ్చింది, రాత్రే బయలుదేరి వచ్చేసాను' అంది శాంతకుమారి వంక చూస్తూ జయశ్రీ.

'పోన్లే - పెద్దావిడ...' అంది అత్తగారు మామగారు చూస్తూ ఊరుకున్నారు ఏమీ మాట్లాడకుండా.

ఆ రాత్రి అంతా కలసి భోజనాలు చేస్తున్నారు. విశాఖపట్నంలో జరిగిన మెడికల్ కాన్ఫరెన్సు గురించి తెగ చెప్తుంటే శ్రద్ధగా వదినగారు, తల్లి వింటుంటే జయశ్రీ రాజేంద్ర ఒకళ్ళ ముఖాలు ఒకళ్ళు చూసుకొని కళ్ళతో మాట్లాడుకున్నారు.

'మీరూ పేపరు చదవలేకపోయారా' అంది జయశ్రీ వచ్చే నవ్వు ఆపుకుంటూ కొంటెగా.

'చదువుదామనే అనుకున్నా....కానీ, రాజేంద్ర భార్యవంక చూస్తూ అన్నాడు.

'ఊటీ వెళ్ళాల్సొచ్చింది'-అందుకనీ కదూ - కొడుకు ముఖం చూస్తూ శంకరరావు అనగానే జయశ్రీ, రాజేంద్రల ముఖాలు ఒక్క నిముషం వెలవెలపోయాయి. మరు నిమిషంలో శంకరరావు రాజేంద్ర, జయశ్రీలు పకపక నవ్వుతుంటే, ఎందుకో అర్థం కాక శాంతకుమారి, తల్లి ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు.

పున్నమి వెన్నెల కిటికీలోకి తొంగి చూస్తుంటే 'ఆ అందుకే నాన్నగారూ' అన్నాడు తండ్రికి మాత్రం వినిపించేలా నెమ్మదిగా రాజేంద్ర!!

"ఇంటింటి చిత్రాలు" మూసీ
- సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక ఆగష్టు 2000